


మనసక చీకట్లు క్రమ్ముకునే వేళలో 'శాంతి నర్సింగ్ హోమ్' ముందు కాలు గాలిన పిల్లిలా పచార్లు చేస్తున్నాడు ధర్మరాజు. అతనికి మనసు మనసులో లేదు. ఆలోచనలతో బుర్ర వేడెక్కి పోయింది. కళ్ళు మూసుకుని మవునంగా ఎదురుగా ఉన్న కుర్చీ మీద కూలబడ్డాడు. డాక్టరు చెప్పిన విషయం గుర్తుకు రాగానే అతనికి తల గిర్రున తిరిగినట్లయింది. నిజంగా ... నిజంగా తన లక్ష్మికి ఏమన్నా జరగకూడనిది జరిగితే...తను భరించలేడు. ఆ ఆలోచన రాగానే అతని ముఖం వివర్ణమయింది. క్షణకాలం స్తిమితంగా ఉండాలనుకుని కళ్ళు మూసుకుని, ముఖాన్ని రెండు చేతులతో బలంగా రుద్దుకున్నాడు. తమ పెళ్ళయి పదేళ్ళయింది. ఇంతవరకు తన ఇంటిలో పారాడే పాపాయి మాత్రం కలగలేదు. పిచ్చి లక్ష్మి ... ఎంత అమాయకురాలు నోయని నోములు, చెయ్యని వ్రతాలు లేవు. చివరకు చిమ్మ చీకటిలో కాంతి కిరణంలా, బాధలతో కుంగిపోయిన తమకు అమృతతుల్యమైన డాక్టరు మాటలు కొండంత ధైర్యాన్నిచ్చాయి. అదే—తమ ఇంటికొక వంశాంకురం రాబోతున్నాడు. తరతరాలుగా కోటీశ్వరుడి వంశం లాంటి తన వంశంలో బిడ్డల్లేరనే కొరత తీరిపోయిం దనుకున్నారు. కాలంతోబాటు కదిలే ఆమె నెలలను చూస్తూ ఎప్పుడా శుభదినం అన్నట్లు ఎదురుచూస్తున్న తనకు డాక్టరు చెప్పిన మాటలు కంపనం కలిగించాయి. కడుపులో బిడ్డ అడ్డం తిరిగిందని, వీలైతే ఆపరేషన్ చెయ్యాలని. ఆ మాట వినగానే తనకు గుండె బరువెక్కిపోయింది. లేకలేక ఇన్నాళ్ళకొక శుభ సూచికలా తన కుటుంబాన్ని ఆనందంతో ముంచెత్తిన ఆ వార్త ఇప్పుడు అశని పాతంలా దాపురించింది. తను కంగారుగా డాక్టరుతో అన్న మాటలకు 'బహుశా బిడ్డ దక్కక పోయినా తల్లి ప్రాణానికైనా గండం రాకూడ'దని అంటే, తమశక్తి వంచనలేకుండా ప్రయత్నిస్తానని చెప్పింది. అవును, డాక్టర్లు మాత్రం ఏం చెయ్యగలరు? వాళ్ళూ మనుషులేగా! అంతా విధి ఆడించే నాటకం. కాని ... తన లక్ష్మి లేకపోతే తన కంతా అంధకారం.. తన జీవితంలో ఉన్న తృప్తి కాస్తా పోతే ... వద్దు ...


మాడుగుల రామకృష్ణ


వద్దు ... ఆ ఆలోచనే వద్దు ... గాభరాగా కుర్చీ లోంచి లేచాడు ధర్మరాజు.

"బాబూ! మీ రింకా ఇక్కడే ఉండిపోయారా! ఇంకా ఇంటికెళ్ళలేదూ! ఎంతసేపని ఉండిపోతారు? నేనొచ్చాగా. బాబూ! అమ్మగారి కేం భయం లేదు. నే నిప్పుడే గణపతి గుళ్ళో తమ పేరు మీద పూజ సేయించి పెసాదం పట్టుకొచ్చాను. అమ్మగారు సుకంగా బిడ్డను కని, మళ్ళీ కులాసాగా ఇంటికొస్తారు. మీరు ఇంటికి పోయి కాస్తంత ఎంగిలి పడండి, బాబూ!" అంటూ సింహాద్రి ఆప్యాయంగా చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

"సింహాద్రీ! నీ మాట నిజమై, నిజంగా దేవుడి దయవల్ల లక్ష్మి నాకు దక్కితే అదే పదివేలు. కాని నా లక్ష్మి దగ్గరే నే నుండాలి. పరిస్థితి ఎటు తిరుగుతుందో, ఏమో? నే నిక్కడే ఉంటాను. నువ్వింటికెళ్ళి రాజుతో విషయమంతా చెప్పు. వీలైతే వాడ్ని ఇక్కడికి పంపించు. రేపు ఉదయమే నువ్వు కూడా రా!" అంటూ బరువుగా శ్వాస పీల్చాడు ధర్మరాజు.

"అట్టాగే, బాబూ! మిమ్మల్నీ, మీ కుటుంబాన్నీ

ఐటెక్స్ - మాట్ ఫినిష్ తిలకము
నాణ్యతను పరిశోధించి
వ్యత్యాసమును చూడండి

ఐటెక్స్ మాట్ ఫినిష్ (EYETEX MATT FINISH) తిలకము మీ మృదువైన చర్మమునకు సరియైనది. మీ అందమును ప్రజ్వలింపజేయును. అనేకమైన మంచి రంగులలో, చర్మమునకు హాని కలగని మంచి సువాసన ద్రవ్యములతో చేయబడినది.

అది ఔషధములు మరియు అలంకార వస్తువుల యాక్ట్ మరియు రూల్స్ ప్రకారము - విజ్ఞాన పూర్వకముగా తయారుచేయబడినది.

ఒక్కొక్క ట్యూబులోను 50% ఎక్కువ తిలకము అదే ధరకు దొరుకుటచే చాల పొదుపైనది.




EYETEX
33 సంవత్సరముల అనుభవము వేరు విధముగ వుండుటకు వీలులేదు.

ARAVIND LABORATORIES MADRAS-600 033

చూడండి! ఈ చిహ్నములనే

క్రౌన్ మరియు సన్ బ్రాండ్

గృహ ఉపయోగమునకు కావలసిన ఉత్తరవాదముగల అల్యూమినియం ఇత్తడి మరియు స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు. ఇండియాలో ప్రసిద్ధమైన గొప్ప అనుభవము గడించిన తయారీదారులు.

జీవన్‌లాల్(1929)లిమిటెడ్,
61, గొల్లవార అగ్రహారం రోడ్డు,
పోస్టుబాక్సునెం. 3059, మద్రాసు-600021
కలకత్తా-మద్రాసు-బొంబాయి - హైదరాబాదు
ఢిల్లీ - మరియు కొచ్చిన్.



మాయొక్క చాలాకాల అనుభవము, బుద్ధికుశలత మరియు కార్యదక్షత. వీటి గొప్పతనము నంతటినీ మా ఖాతాదారుల కొరకై సమర్పించుచున్నాము.

MAC/JK/ 110 TEL

బిడ్డ చూసుకుని, ఆ బిడ్డను పెంచి పెద్ద చెయ్యాలి. విచారించకు సింహాద్రీ." ఓదారుస్తూ అన్నాడు ధర్మరాజు.

"బాబూ! నా గుండె బరువైపోతోంది. నా పాలితో పాటం బాలగా అది దొండరలో బిడ్డను కని నా కియ్యాలని తాపత్రయం పడి తొందరగానే ఈ ప్రపంచాన్ని విడిచిపెట్టిపోయింది. అది దేవత బాబూ! నేనే పాపిష్టివాణ్ణి. దాన్ని దక్కించుకోలేక పోయ్యాను. నేను బతికుండి ఉపయోగం లేదు, బాబూ!" మళ్ళీ ఘొల్లుమన్నాడు సింహాద్రి.

"సింహాద్రీ! బాధపడకు. మేమంతా నీకు లోడున్నాం. నీ రత్నాలు వెళ్ళిపోయినా నీ బిడ్డకోసం, వాడి బాగుకోసం పైనించి చూస్తూ ఉంటుంది. నా మాట విని ధైర్యం తెచ్చుకో. నీ బిడ్డ ముఖం చూసయినా ఆలోచించు. లే! మిగతా పని చూడు" అంటూ అతని భుజం తట్టి అతణ్ణి లేవనెత్తాడు ధర్మరాజు.

కాలం మామూలుగానే సాగిపోతూంది. సింహాద్రి కొడుకు ఆలనా, పాలనా ధర్మరా జింట్లోనే వచ్చేసే సీత చూస్తూంది. క్రమక్రమంగా సింహాద్రి బాధ నుంచి బయటపడుతున్నాడు. కాని రత్నాలు జ్ఞాపకాలు అతన్ని అనుదినం వేధిస్తుంటే అక్కడుండలేక స్థలం మార్పుకోసం కొన్నాళ్ళు ఊళ్ళు తిరిగాడు. ఒక నెల రోజుల తరవాత అతను మళ్ళీ తన ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లోకి ప్రవేశించగానే మేడమీద ఏడ్పులు ఘొల్లున వినిపించాయి. అదిరిపడి మేడ మీదకు పరిగెత్తాడు సింహాద్రి. కన్పించిన దృశ్యానికి మాట రాక అచేతనంగా అలాగే నిలబడిపోయాడు. ధర్మరాజు చేతిలో పసిబిడ్డ నీలంగా మారి, మెడ వంకర తిప్పి పడిపోయి ఉన్నాడు. అతని పైబడి ధర్మరాజు భార్య లక్ష్మి దారుణంగా విలపిస్తూంది. ధర్మరాజు కళ్ళ వెంబడి అశ్రువులు ధారగా కారిపోతున్నాయి. బిడ్డను చూపిన కొద్దీ లక్ష్మి వెక్కి వెక్కి ఏడుస్తూంది. ప్రక్కగా తలుపు వానుకుని మౌనంగా ధర్మరాజు తమ్ముడు రాజా నిలబడి ఉన్నాడు. సింహాద్రికి అంతా విచిత్రంగా తోచింది. దేవుడి లీలలు ఎంత విచిత్రంగా ఉంటాయి. నిన్న, మొన్న తన జీవితంలో కురిసిన తుఫాను వెలుస్తూండగానే మళ్ళీ బాబుగారి బ్రతుకులో సుడిగుండం. మొన్నటిదాకా తనను ఓదార్చిన అయ్యగారిని ఇప్పుడు తను ఓదార్చాలా! అయినా గొంతు పెగుల్చుకుంటూ "బాబూ! ఏం జరిగింది 'బాబూ! చినబాబు కేమయింది?" అన్నాడు.

"అయిపోయింది, సింహాద్రీ! సర్వనాశనం జరిగిపోయింది. చినబాబు ఇక లేడు. మనల్నందరినీ వదిలి వెళ్ళిపోయాడు. నిన్నటి ఉదయం వరకు బాగానే ఉన్నాడు. మధ్యాహ్నం నుంచి ఒకటే వాంతులు, విరేచనాలు. కళ్ళు తేలేసి వెలిదిరిగి పోయాడు. బిడ్డ గుణం వచ్చిందని డాక్టరు చెప్పాడు. ఆ తరవాత...' చెప్పలేకపోయాడు ధర్మరాజు.

"ఎంత ఘోరం జరిగిపోయింది బాబూ! ఆ దేముడికి దయలేదు, బాబూ. ఇచ్చినట్లే ఇచ్చి తీసుకుపోయాడు. ఇచ్చిన ఆనందం చూడటానికి కాదన్నట్లు చేశాడు. ఊరుకోండి, బాబూ!" అన్నాడు సింహాద్రి గద్గదంగా.

"అయ్యయ్యో! ఎంత విచారించినా పోయిన బిడ్డ తిరిగి రాదు. ధైర్యంగా ఉండాలి. వదినా! బాధపడకు. ఒరేయ్ సింహాద్రి! మిగతా పని నువ్వే చూడాలి. నువు వెళ్ళు" అన్నాడు రాజు సింహాద్రి దగ్గరకొస్తూ.

"బాబూ! నేనా నా వల్ల కాదు, బాబూ! నా చేతుల్తో నేనా పని చెయ్యలేను. చెయ్యలేను, బాబూ!"

"కాదు, సింహాద్రీ. నువ్వే వెళ్ళాలి. కాదనకు. ఈ ఇంటి ఉప్పు తింటున్న నౌకరివి. ఈ ఇంటి సుఖదుఃఖాల్లో నీకూ భాగం ఉంది. వెళ్ళు" అంటూ అతన్ని బలవంత పెట్టాడు. ఆ పని ముగించి తిరిగి వచ్చాడు సింహాద్రి. ఇప్పుడు ధర్మరాజును, అతడి భార్యను ఓదార్చటం అతడి వంతయింది. ఊయల దగ్గరకి వెళ్ళి తన బిడ్డను కళ్ళారా చూసుకున్నాడు సింహాద్రి. అచ్చం తన భార్య పోలికే. దొరబిడ్డలా ఒళ్ళువిరిచి మిసమిస లాడుతున్నాడు. ప్రేమతో ఆ బిడ్డను దగ్గర కెత్తుకుని కౌగిలించుకున్నాడు. ఆప్యాయంగా తల నిమిరి మళ్ళీ పడుకోబెట్టాడు. అదే కొంతవరకు తృప్తి నిచ్చినట్టయింది. నిజంగా ప్రపంచంలో ప్రేమ, మమకారం ఎంత గొప్పవో అనిపించింది. నెం గుర్తయిన అయ్యగారి చినబాబును తనే మట్టి చేశాడు. కాని ... నా బిడ్డ బాగా ఎదిగి పైకి రావాలి. పెద్దగా చదువుకుని గొప్ప నౌకరీ చెయ్యాలి. ఈ ఆలోచనే మధురంగా లేచి అతడి మనస్సులో పొంగిపోయింది.

ఇప్పుడు కాలం మామూలుగా కాక వేగంగా ముందుకు కదిలిపోతోంది. ఋతువులు, సంవత్సరాలు కరిగిపోతున్నాయి. ధర్మరాజు నల్లజుట్టు క్రమంగా తెల్లబడిపోతోంది. సింహాద్రి కండల్లో సత్తువ తగ్గిపోయినట్లుంది. సింహాద్రి కొడుక్కిప్పుడు పదేళ్ళు. స్కూల్లో చదువుకుంటున్నాడు. వద్దంటున్నా వినక పిల్లవాడిని కాన్వెంటులో చేర్పించాడు ధర్మరాజు. వాడి ఆలనా పాలనా అన్నీ ధర్మరాజింట్లోనే. వాడన్నీ ఇంగ్లీషులోనే మాట్లాడుతుంటే సింహాద్రికి చూట్టానికి రెండు కళ్ళు చాలటంలేదు. రోజూ బడికి బండిలో పోయి, బండిలో తిరిగొస్తున్నాడు. వాడి కన్నీ గొప్పోడి బుద్ధులే అబ్బుతున్నాయి అనుకున్నాడు సింహాద్రి. ధర్మరాజుగారే కుర్రవాడికి 'శేఖర్' అని పేరు పెట్టారు. వాడు అయన్నీ, భార్యనూ ఇంగ్లీషులో మమ్మీ, డాడీ అంటూ పిలుస్తాడు.

ఆ రోజు మామూలుగానే తెల్లవారింది. రోజూ వేళకి లేచి బడికెళ్ళే శేఖర్ ఆ రోజు తయారుకాలేదు. బండి వచ్చి వాకిట్లో నిలిచింది. సింహాద్రి గదిలో ఇంకా నిద్రపోతున్న వాడిని మందలించి లేపి కూర్చో బెట్టాడు. వాడు మళ్ళీ యథాప్రకారం దుప్పట్లో దూరాడు. సింహాద్రి కోపంతో "యెదవా, లెగు! బండొచ్చి ఆగింది. ఇయ్యాళేమైంది నీకు. రాన్రాను దొరబిడ్డవై పోతున్నావ్. లెగు!" అంటూ ఒకటి తగిలించాడు. వాడు ఆరున్నొక్క రాగం మొదలెట్టాడు. బయటకెళ్ళబోతున్న ధర్మరాజు ఆత్రతగా వచ్చి బాబును బుజ్జగిస్తూ కారణం అడిగాడు. వాడు ఏడుస్తూనే "డాడీ! టుడే ఆయామ్ ఫీలింగ్ కోల్డ్. ఐ కెనాట్ గో టు స్కూల్. దిస్ సర్వెంట్ హేజ్ బీటెన్ మీ!" అన్నాడు. ధర్మరాజు ఆత్రతగా "సింహాద్రీ! శేఖర్‌కు జలుబు చేసింది. ఇవాళ బళ్ళోకి





## "ఎత్తర తెరచాప"

ఎస్. మురళీధరరావు (హైదరాబాదు)

వెళ్ళడు. మన డాక్టరుకి ఫోన్ చేసి రమ్మని చెప్పు. అయినా కారణం తెలుసుకోక పిల్లవాడిని కొట్టొచ్చా. నీకు బుద్ధిలేదు" అంటూ కేకలేశాడు.

"ఏటి, బాబూ! ఎదవది సదిపెం బడితేనే ఇంటిదా! ఆ ఎదవ దొంగేసకా లేస్తన్నాడు. మీరిట్టా ఆడు ఏదంటే దానికి సై యంటే రేపు నెత్తికెక్కుతాడు. ఆడ్ని ఎంతలా సూడాలో అంతలోనే సూడండి, బాబూ. ఆడెంతైనా నౌకరోడి బిడ్డేకదండీ! రెండు తగిల్తేస్తే అన్నీ బోతాయి, మీరూరుకోండి ..."

"నోర్మూయ్! ముందు నేను చెప్పినట్టు డాక్టరుకు ఫోన్ చేసి చెప్పు. తొందరగా రమ్మను. ఎదురు చెప్పకు. వెళ్ళు" అంటూ కసురుకున్నాడు. సింహాద్రి చిన్నబుచ్చుకున్నాడు. వాడికొక ప్రక్క ఆనందం, మరో పక్క విచారం—రెండూ కలిగాయి. 'నిజంగా వాడ్ని దొరబిడ్డలానే సూసుకుంటున్నారు. ఎర్రోళ్ళు, కానీ ఆడెంతైనా నా కడుపునే కదా పుట్టింది. నౌకరు బిడ్డ నౌకరోడే. ఈళ్ళ కెందుకో ఇంత పేమ' అనుకున్నాడు. మరో రోజు శేఖర్ ఆడుకోవటానికి తన స్నేహితులను ఇంటికి తీసుకొచ్చాడు. సాయంత్రం లాన్లో కుర్చీల్లో కూర్చున్నారు ధర్మరాజు, భార్య. శేఖర్ తన స్నేహితులతో ఆడుకుంటున్నాడు. దూరంగ పడిన బంతిని తెచ్చి ఇయ్యటం సింహాద్రి పని. ఆట లయ్యాక పిల్లలందరికి టిఫిన్, కాఫీ ఇచ్చాడు సింహాద్రి. పిల్లలు ఇంగ్లీషులో సింహాద్రి ఎవరని శేఖర్‌ను అడిగారు. 'హి ఈజ్ అవర్ సర్వెంట్' అన్నాడు శేఖర్. అందరు పిల్లలూ అతన్ని అలాగే పిలుస్తూ వాళ్ళ పనులు చేయించుకున్నారు. సింహాద్రి ఆ పదాన్ని బాగా జ్ఞాపకం పెట్టుకున్నాడు. పదే పదే శేఖర్ సింహాద్రిని అలాగే పిలుస్తుంటాడు. పిల్లలందరితోబాటూ శేఖర్ కూడా కార్లో బయటికి వెళ్ళిపోయాడు. సింహాద్రి కూడా ఆలోచిస్తూ గేట్ తీసి బయటకు వెళ్ళాడు. ఆ రోజు రాత్రి ధర్మరాజు పడుకుంటానికి తన గదికి వెళుతూ గుడ్ నైట్ చెప్పటానికి శేఖర్ గదికి వెళ్ళిపోయాడు. లోపల సింహాద్రి శేఖర్‌ను బతిమాలుతున్నాడు నాన్నా అని పిలవమని. వాడికేం అర్థం కాక అరుస్తున్నాడు ఇంగ్లీషులో. చివరికి సింహాద్రిలో ఓపిక నశించి శేఖర్‌ను చావ బాదసాగాడు. పెద్దగా అరుస్తూ ఏడ్పు మొదలెట్టాడు శేఖర్. ధర్మరాజు కంగారుగా అడుగులు వేస్తూ గది తలుపు గట్టిగా తోసి గదిలోకి అడుగుపెట్టాడు.

"ఒరే, సింహాద్రి! నీ కేమైనా మతి పోయిందా. బంగారం లాంటి బిడ్డను చావగొడుతున్నావ్? ఇంతకీ వాడేం తప్పు చేశాడని. రోజు రోజుకూ నీ చేతలు మితిమీరుతున్నాయి. వెళ్ళిక్కడ్నుంచి." పీలైనంత గట్టిగా అరిచాడు.

సింహాద్రి ఓపిక నశించిన వాడిలా "అవును, బాబూ! ఆడు నాకేం కాడుగా. అందరి ఊసుల్లో ఈడు మీకొడుకు. కన్నతండ్రిని నన్ను.... నన్ను ఏం పిలుస్తున్నాడో తెలుసా, బాబూ! నౌకరు ఎదవా అని. కళ్ళతో సూస్తూ కూడా మీరేం పలకరు, బాబూ. ఎంత తండ్రిలా మీరున్నా ఆడు నిజంగా నా కొడుకే, బాబూ! రోజూ ఆడు నన్ను నౌకరూ, నౌకరూ అని పిలుస్తున్నాడు. నే నది భరించలేను, బాబూ! మీరు నాకూ, నా బిడ్డకూ దేవుడు, బాబూ. కాని నా కొడుక్కి తండ్రి మాత్రం కాకూడదు. ఇది నా పిచ్చని, ఎర్రని అనుకున్నా సరే, నేను బాధపడను. ఇవాళ ఈడు స్నేహితుల ముందు నన్ను తెగ పిలుస్తుంటే అర్థం తెలుసుకుని మురిసిపోదామనుకున్నంటి పీడరుగా రబ్బాయిని అడిగితే సెంపమీద కొట్టినట్లు సెప్పాడు బాబూ! దీన్ని భరించలేను, బాబూ" అంటూ బావురు మన్నాడు సింహాద్రి. జరిగింది వినే సరికి పరిస్థితి అర్థమయ్యింది ధర్మరాజుకు.

సానునయంగా సింహాద్రిని చూస్తూ "చూడు, సింహాద్రి! బాధపడకు. శేఖర్ చిన్నవాడు. అభం, శుభం తెలియని పసివాడు. వాడేదో అన్నాడని బాధపడతావేంరా! చిన్నతనం కదా! సర్ది చెబితే అదే తెలుస్తుంది. విచారపడకు. వాడిచేత నిన్ను నాన్నా అని పిలిపిస్తాను. ఏదో వాడ్ని పెంచి పెద్దచేసి ప్రయోజకుడ్ని చెయ్యాలని నా తాపత్రయం. అంతే కాని నీకూ, నీ బిడ్డకూ మధ్య నేను నిలవాలనికాదు నా ఆశయం. తెలిసిందా. వెళ్ళు" అంటూ ఓదార్చాడు.

"మీరు నిజంగా దేవుడే బాబూ! ఆసి విషయంలో మీ శ్రద్ధ తెలిసినా తండ్రిగా నేను వాడ్నించి పేమను పొందలేక పోతున్నాను. అదే నా ఆరాటం. తప్పయి పోయింది. చెమించండి" అంటూ లోపలికి వెళ్ళి పోయాడు.

■ ■ ■

క్రమంగా శేఖర్ హైస్కూలు వదిలి కాలేజీలో ప్రవేశించాడు. పట్నంలో హాస్టల్లో ఉంటే బాగా చదువుకుంటాడని అక్కడే కాలేజీలో చేర్పించాడు ధర్మరాజు. సింహాద్రి వద్దన్నాడు. చదివిన చదువు చాలన్నాడు. కాని శేఖర్ చాలా చురుకైన వాడు.

వాడు చదువుకుంటే కలక్టరవుతాడని ధర్మరాజన్నాడు. 'వాడు నిజంగా కలక్టరయితే నీకు మాత్రం గొప్పకాదా' అని సింహాద్రి నోరు మూయించాడు. "నౌకరు కొడుకు కలక్టరని ఊళ్ళో అంతా అంటారేమో. శత్. అంటే అనుకోనీ ఎదవల్ని. ఆడు గొప్పోడు—మంచి జాతకం ఉన్నోడు అని అందరి నోళ్ళూ మూయిస్తే సరి." ఇలా ఆలోచిస్తున్నాడు సింహాద్రి. అప్పుడప్పుడూ శలవలకు ఇంటి కొస్తాడు శేఖర్. ధర్మరాజు తోను, అతని భార్య తోను ఎక్కువ మాట్లాడతాడు. తనతోఎక్కువమాట్లాడక పోవటం, ఎప్పుడో అవసరం అయితేనే పిలవటం బాధనిపించింది సింహాద్రికి. అయినా ఆ బాధను లోలోపలే అనుభవిస్తున్నాడు. కన్నతండ్రిని కనీసం నాన్నా అని పిలిచినా చాలు. అదికూడా లేదు అని కుమిలి పోతున్నాడు. ఇప్పుడు సింహాద్రికి వార్ధక్యం వచ్చేసింది. ఒక కన్ను చూపుకూడా ఆనటం లేదు. శరీరం ముడతలు పడి సత్తువ ఉడిగిపోయింది. అందుకుతగ్గట్టు మనసుకు ఆనందమే లేదు. శేఖర్ వచ్చి వెళ్ళినప్పుడల్లా మరీ బాధ పడుతుండే వాడు. అయినా తనను తాను ఓదార్చుకుంటున్నాడు. "ఇంకెంత—ఏడాది ఆగితే సేకరం సదువయి పోతుంది. ఎక్కడో ఒక చోట నౌకరీ కుదిరాక ఆడికి పెళ్ళి సేసి ఆడి కాడ్నే ఉంటే సరి. ఇడిగా ఉంటేనే కాని ఆడికి తండ్రి పేమ తెలియదు. ఆరి బిడ్డను ఆళ్ళో సూసుసుని తెగ మురిసిపోతున్నారు అమాయకులు. . . కాని ఇదంతా నిజంగా ధర్మరాజు గోరి దయే" అనుకున్నాడు సింహాద్రి.

ఒక రోజు ధర్మరాజు సింహాద్రిని పిలిచాడు మేడ మీద శేఖర్ గదిని సర్దుతున్న సింహాద్రి రెక్కలు కట్టుకుని ధర్మరాజు ముందు వాలాడు. పడక్కుర్చీలో మేను వాల్చిన ధర్మరాజు ఆలోచనానంతరం కళ్ళు తెరిచి సింహాద్రిని చూస్తూ "వర్షం మొచ్చేట్టుగా ఉంది. కిటికీ తలుపులు వేసేయ్. చూడు, సింహాద్రి, నీతో ఒక ముఖ్య విషయం చెబుతున్నాను. ఈ ఏడాదితో వాడి చదువు అయిపోతుంది. అదయ్యాక వాడికి పెళ్ళి చేయాలనుకుంటున్నాను. మంచి సంబంధంకూడా చూశాను. ఈడూ జోడూకూడా బాగుంది. ఎవరో కాదు—నా స్నేహితుడి కూతురే. నా బొందిలో ప్రాణముండగా ఆ నాల్గక్షింతలూ పడితే ఆదే చాలు" అన్నాడు.

సింహాద్రికి క్షణం సేపు బుర్ర పనిచేయలేదు. తన దనుకున్న వస్తువు నెవరో దూరంగా లాక్కుపోతున్నట్లనిపించింది. గుండెలో బాధ ఉప్పొంగి అసహనంగా "బాబూ, ఆడ్ని పెంచితే కాదన్లేదు. సదువు సెప్పించి పైకి తీస్కొస్తే కాదనలేదు ఇప్పుడు మాత్రంకాదనాల్సొచ్చినందుకు సెమించండి. ఆడు ఎంతైనా నా బిడ్డ, బాబూ. ఆడికి మా కులంలోనే అమ్మాయిని సూసి పెళ్ళి సెయ్యాలనుకుంటున్నాను. ఈ వయసులో ఆడే నాకు తోడు బాబూ" అన్నాడు సింహాద్రి.


"నేను మాత్రం కాదన్నానా. బాబుకు పెళ్ళి చేస్తే భార్యతో బాటే ఇక్కడేఉంటాడు. నువ్వుకూడా వాళ్ళని రోజూ చూస్తూండవచ్చు. ఇక కులాలంటావా. అందరిది ఒకే కులం. వాడు నా బిడ్డే అనుకో. వాడి మీద అధికారం నా కొదిలేయ్. సొంత తండ్రి కాకపోయినా పెంచిన తండ్రిగానన్నా. . .'

"బాబూ. అదే బాబూ, దాన్నే కాదంటుంది. మీరు దయతో ఆడ్ని పెంచి పెద్ద సేశారు. సదువూ సంధ్యా నేర్పారు. దానికి మీ రుణం తీర్చుకోలేను. కాని నా బిడ్డను మీ బిడ్డగా ఊహించ లేను, బాబూ. అలా మీ కప్పగించ లేను. అది నావల్ల కాదు, బాబూ నా వల్ల కాదు. ఆడెందుకో రాన్రాను మరీ దూరమై పోతున్నాడు. ఇంకొన్నాళ్ళు పోతే నే నెవరో తెలీదని, బయటికి పొమ్మంటాడు. అందుకే ఇయ్యాల ఆడితో అన్నీ తేల్చేసి—ఆడ్ని ఎటన్నా తీసుక పోతాను. ఆడు సదివిన సదువుతో ఎక్కడన్నా బతకలేకపోం. అయినా నౌకరోడి బిడ్డపై మీ కెందుకయ్యా అంత మమకారం. ఆ డెన్నటికైనా నా సొంతం కాని, మీ క్కాదు. దేవుడిలా మిమ్మల్ని గౌరవిస్తుంటే, మీ రేమో నన్ను, నా బిడ్డను దూరం సేస్తున్నట్లనిపిస్తుంది. అందుకే ఎవరికీ భారం కాకుండా ఎటన్నా పోతాం "బాబూ. . . పోతాం" వెర్రి ఆవేశంతో అన్నాడు సింహాద్రి. ధర్మరాజుకు పరిస్థితి పూర్తిగా అర్థమయింది. 'నిజంగా సింహాద్రి అన్నంత పని చేసి కుర్రాడి మనసు విరిచేసి తనతో తీసుకుపోతే తి కెవరు దిక్కు?' అన్ని ప్రాణాల శేఖర్ మీద పెట్టుకుని బతుకుతున్న తనకు సింహాద్రి అడ్డుగా నిలిచినట్లయింది. ఆవేశంగా కుర్చీలోంచి లేచి గోడ వైపుకు వెళ్ళాడు. కిటికీ తలుపులు తీసేస్తూ . . . "సింహాద్రి, నీ ఆలోచనలు చాలా దూరం వెళుతున్నాయి. నీ బిడ్డను పరాయి బిడ్డగా చూడలేవు కాని, వాడు పెరిగి పెద్దయి వృద్ధిలోకి వస్తే మాత్రం నీ బిడ్డని మురిసిపోతావ్. నువ్వు చాలా స్వార్ధపరుడివి. విశ్వాసం నీలో తరిగిపోయి దాని స్థానంలో స్వార్థం తలెత్తింది. ఏది ఏమైనా, శేఖర్ ఈ ఇంటినుంచి బయట కెళ్ళడానికి వీల్లేదు. నా కంటంలో జీవం ఉన్నంతకాలం వాడి నెవరూ నా నుంచి వేరు చెయ్యలేరు. నువ్వు ఇక్కడ ఉన్నాసరే, ఈ ఇంట్లోంచి పోయినాసరే" దృఢ నిశ్చయంతో అన్నాడు ధర్మరాజు.

"బాబూ. సాలా ఇసిత్రంగా మాట్లాడతన్నారు ఏవం బిడ్డను సాకితే మీ బిడ్డ అయిపోలేదు, బాబు. ఆడ్ని కన్నతండ్రీ ఇంకా బతికే ఉన్నాడు. ఆడిమీదే మీ పాణాలుంచితే అది మీ ఎర్రితనం కాని ఇంకోళ్ళ తప్పు కాదు. అయినా నా బిడ్డను నేను తీసుకుపోతానంటే మీ రెవరు బాబూ ఆపటానికి. తండ్రీ బిడ్డలను ఏరుసెయ్యటం సాలా పాపం. మీరు పెంచిన వాళ్ళయితే ఆడి కోసం ప్రాణా లుంచుకొని, ఆడమ్మ సచ్చిన కాడ్నుంచి బతుకుతున్నోణ్ణి. మీ మీద ఆడికంత పేముంటే అప్పుడప్పు డొచ్చి సూసి పోతా ఉంటాడులే. కాని సూడు బాబూ: నన్నేదో సార్థమని, ఇంకోటని అంటున్నారే పిల్లల మీద పేమంటే మీ కేం తెలుసు బాబూ కన్నబిడ్డని పెంచే రాత లేకపోయింది. పుట్టి పుట్టంగానే ఆడి నోట మన్ను కొట్టారు. ఎవడో కొడుకుని పెంచి ఆడి తండ్రీ ముసలి వయుస్సులో ఛత కూడా లేకుండా సెయ్యాలనా? పాపం బాబూ. కన్న బిడ్డని పెంచలేని మీకు నిజమైన మమకారం తెలీదు. మీ బిడ్డ ఏ నాడో మట్టిలో కల్సిపోయాడు. ఆడికి నూక లెప్పుడో సెల్లిపోయాయ్. ఆడ్ని తలుసుకుని ఆనందించండి కాని. . . నా బిడ్డను నాకు దూరం సెయ్యకండి. శానా పాపం." ఆవేదనతో కూడిన బాధను వెళ్ళగక్కాడు సింహాద్రి.

"హుం. నీ బిడ్డ. ఈ నాడు నువ్వు ఇలా మాట్లాడటానికి కారణ మెవరో తెలుసా? నేను. ఎవరి కోసమయితే ఇన్నాళ్ళూ నిప్పులాంటి నిజాన్ని నాగుండెల్లోనే బంధించి, ఎక్కడా బయట పడకూడదని ఆక్రోశించానో అటువంటి నా చేత ఈ నాడు నిర్బంధంగా నిజాన్ని చెప్పిస్తున్నావ్. ఇన్నాళ్ళూ నా బిడ్డ, నా బిడ్డని మురిసి పోతున్నావె వాడు నిజంగా నీ బిడ్డ కాదని తెలిస్తే ఏం చేస్తావ్. నువ్వు కన్నతండ్రివి కాదని, వాడికికూడా ఈ ఇంటి నౌకరు వని తెలిస్తే ఏమవుతావ్? నిజానికి మట్టిలో కలిసిపోయింది నీ కొడుకే. ఇప్పుడు నీ బిడ్డని మురిసి పోతున్న వాడే నా కొడుకు. నీ కోసమని, నీ ప్రాణాలు రక్షించటానికి ఇన్నాళ్ళూ కన్నబిడ్డనికూడా ఏ నాడూ నా వాడిగా






ఇది ఇంతవరకు చెప్పనివ్వలేదు. ఎందుకో తెలుసా? భార్య పోయి, సగం క్రుంగి కృశించిన నిన్ను ఇంకా బాధ పెట్టడం ఇష్టం లేక. నిజానికి నీ భార్యతో బాటూ, నీ బిడ్డకూడా లేడని తెలిస్తే నీ గుండె ఎక్కడ ఆగిపోతుందో అని ఇన్నాళ్ళూ ఈ విషయాన్ని దాచి పెట్టాను. కాని ఈ రోజు నా చేత చెప్పించావు. నువ్వు చేజేతులారా మట్టి చేసింది నీ కన్న కొడుకునే. వాడు నీ స్వంత బిడ్డ." ఆవేశంలో ఎనికినికూడా మరిచిపోయి అనవసరమైందేదో అనేశాడు ధర్మరాజు.

సింహాద్రి గుండె కొంత సేపు ఆగిపోయినట్టయింది. ప్రపంచమంతా గిర్రున కళ్ళ ముందు తిరుగుతున్నట్టు, ఉప్పెనలో తలకిందు అయిన నావ మాదిరి ఉన్నట్లయింది. కాస్సేపు స్తంభించి నట్టు అలాగే నిలబడిపోయాడు. కొంతసేపటికి తేరుకున్నాడు. జరిగిన విషయం గుర్తుకు రాగానే గుండె పగిలిపోయేట్టు ఏడ్చాడు.

"బాబూ, అడ్ని మీ బిడ్డని మాత్రం అనకండి. అడిమీద ప్రేమ, ఇష్టం ఉంటే మాత్రం 'నీబిడ్డ కాదురా' అని-నా గుండె పగల కొట్టకండి. చెప్పండి, బాబూ. మీరు చెప్పిందంతా అబద్ధమని, ఊరికే నవ్వులాట కన్నానని. అడునాబిడ్డే బాబు. నాకు తెలుసు. నా రగతమే, అడిలోకూడా ఉంది బాబూ. బాబూ చెప్పండి అడు నీ కొడుకేరా పిచ్చోడా అని" అంటూ విలపించసాగాడు.

"బాధ పడకు, సింహాద్రి. ఇంత కాలం దాచిన ఈ నిజం బయట పడిపోయింది. అయినా ఈ సంగతులేం శేఖర్‌కు తెలియవు. వాడితో నువ్వే వాడి తండ్రివని, మేం పెంచిన వాళ్ళమని చెబుతాను. వాడి దగ్గరే ఉండి వాడి ఆలనా పాలనా చూసుకో. ఈ విషయం మనిద్దరి మధ్యనే ఉండనీ." అన్నాడు పశ్చాత్తాపం చెందుతూ ధర్మరాజు.

"నేను మోసపోయాను బాబూ. నా కన్న బిడ్డను నాకు తెలియకుండానే నేనే మట్టి సేశాను ఆ నాడే నాతో నిజం చెబితే గుండె బద్దలయి నా రత్తాలుతో బాటు నేనుకూడా పోయుండేవోడ్ని. ఇంకా నన్ను బతికించి రోజూ కుళ్ళి కుళ్ళి కుమిలించమని ఇంత పిచ్చేశారు. ఆడిమీద నేనెన్నో ఆశలు పెట్టుకున్నాను. ఆడు పెరిగి పెద్దయి గొప్ప నౌకరీ సేస్తుంటే, నన్ను ఎంతో ఆదరించి గౌరవిస్తుంటే సూసి మురిసి పోవాలనుకున్నాను. కాని ఇప్పుడు నాది కానిదాన్ని నా దగ్గరుంచుకోమనటం మీకు ధర్మం కాదు. నాకు ఇష్టం లేదు. అయినా ఈ పాపిష్టోడ్ని ఎందుకు బతికించారు బాబూ." ముఖాన్ని చేతుల్లో కప్పుకుని అన్నాడు సింహాద్రి.

"చూడు, సింహాద్రి. కష్టాలనేవి అందరికీ వస్తాయి. నీ జీవితంలో భార్యను పోగొట్టుకుని సగం బతికిన నీకు నీ బిడ్డకూడా కరువై పోయాడని తెలిస్తే నువ్వేమవుతావో నాకు తెలుసు. అందుకే ఆ రోజు వాంతులతో, విరేచనాలతో మెలివంకరలు తిరిగే నీ బిడ్డను నాబిడ్డని చెప్పి నిన్ను నమ్మించాను— ఈ రోజు నా బిడ్డకు నువ్వే తండ్రివని చెప్పి లోకాన్ని నమ్మిస్తాను. ఇదంతా నా కోసం, నా సుఖం కోసం కాదు. నీ కోసం. కేవలం నన్ను నమ్ముకున్న నీ కోసం. ఎప్పటిలా శేఖర్ నీ బిడ్డే. వాడిపై అన్ని అధికారాలు నీకే వదిలేస్తున్నాను" అన్నాడు ధర్మరాజు కళ్ళు తుడుచుకుని.

"సాలా తేలిగ్గా అన్నారు బాబూ—అడ్ని నా కొడుగ్గా సూసుకోమని. నాది కాని దాన్ని నా దగ్గరుంచుకోవటం నా సేత కాదు బాబు. నా అనే మమకారం గుండెల్లో పుట్టుకు రావాలి కాని పైకి తెచ్చి పెట్టుకుంటే రాదు. అయినా నా కన్న బిడ్డడు కానోడ్ని ఎలా బిడ్డగా సూసుకోగలను. సూసుకున్నా ఆడు నా సొంతం కాదుగా. ఆడ్ని కొట్టినా, పేమించినా నేను పరాయి వోడ్నేగా. ఇది నా వల్ల కాదు బాబూ. మీరు నన్ను బతికించి, నాకు మేలు కాదు బాబూ కీడే సేశారు. నా బిడ్డ. . . నా రత్తాలు పేమగా నా కందించిన బిడ్డ మట్టిలో కలిసి పోయాడు. ఆడి నోట నేనే మన్ను కొట్టాను. నే నెన్నో ఆశలు పెట్టుకున్న నా వోడు మట్టిలో కలిసి పోయాడు. నా రత్తాలు పోయినా ఆ ఒక్కడి కోసమే ఇన్నాళ్ళూ బతికాను. కాని నా బిడ్డ, నా రగితం లేకపోయాక నేను బతికుండి పెయోజనం లేదు. నేను మోసపోయాను బాబు. తియ్యటి విషం తాగి ఇంకా బతక లేను. నా జీవితంలో ఇంక నాకు తోడెవ్వరు లేరు. దేముడిలా మిమ్మల్ని పూజిస్తే నా మీద నిప్పుల వాన కురిపించారు—ఇద్దరూ మట్టయి పోయారు. నేను ఒంటరోడ్ని. తొమ్మిది నెలలు కని మోసిన నా బిడ్డ మట్టి. . . మట్టి. . . హ్హాహ్హా. మట్టయి పోయాడు. నా రత్తాలుకూడా మట్టయి పోయింది. నా దేవుడు నన్ను మోసం చేశాడు. నా పాణానికి పాణమయిన నా బిడ్డను దూరం సేశాడు. నా కెవ్వరూ లేరు. నే నెవరికీ తండ్రిని కాను. పిచ్చోడ్ని. . . ఒట్టి పిచ్చోడ్ని. . . బతికున్న పీనుగని. హ్హ హ్హా. నా కెవ్వరూ లేరు. నా బిడ్డ నాకు లేడు. నా రత్తాలు నాకు లేదు. ఒంటరోడ్ని. . . బిడ్డలు లేనోణ్ణి. హహ్హా. హహ్హాహ్హా" అంటూ పిచ్చిగా నవ్వుతూ శరీరం యావత్తూ ఒణికిపోతూ ఊగి పోతున్నాడు సింహాద్రి. అతని ముసలి హృదయం బాధకు తట్టుకోలేక చిన్నాభిన్నమై పోయింది.

"సింహాద్రి. సింహాద్రి. ఏమిటేది? ఇలా అయి పోతున్నావ్? నీ బిడ్డ బతికే ఉన్నాడు. నమ్ము. శేఖర్ నీ బిడ్డ. నా మాట నమ్ము." ధర్మరాజు కంగారుగా ఏదో చెప్పాలని చూశాడు.

"లేడు. లేడు. నా బిడ్డ లేడు. నా దేవుడు లేడు. అందరూ నన్ను మోసం చేశారు. నేను నా రత్తాలు లేదు. మోసపొయ్యాను. పాపిష్టోడ్ని. అదురుష్టం లేనోడ్ని నేను బతకకూడదు. బతికుండి సావకూడదు. అందుకే నా రత్తాలును సేరుకోవాలి. దానితో, నా బిడ్డతో నిజం సెప్పుకోవాలి. నా రత్తాల్ని సేరుకోవాలి. నా పాపాన్ని నేనే అనుబవించాలి. రత్తాలూ. రత్తాలూ" అంటూ మతి చలించేట్లు శూన్యంలోకి పరుగు తీశాడు సింహాద్రి.

"సింహాద్రి. నా మాట విను. ఇది న్యాయం కాదు. నా మాట విను" అన్న ధర్మరాజు కేకలు గాలిలో కలిసిపోయాయి. ఫెళఫెళ గర్జనలతో వర్షం మొదలైంది. కుండపోతగా వర్షం పడుతూంది. సింహాద్రి పరుగెత్తుతూ వెళ్ళిపోతున్నాడు. దారీ, తెన్నూ లేని పరుగు. . . గమ్యం తెలియని పయనం. పిచ్చిగా కేకలు పెడుతూ, ఒళ్ళు తెలియని ఆవేశంతో పరుగులు తీస్తున్నాడు. ఎదురుగా గణపతి ఆలయం. దాని క్కొంచెం దూరంలో కల్లు దుకాణం. అంత ఆవేశం లోనూ. . . గుడి ముందు ఆగిపోయాడు. మెల్లగా కల్లు దుకాణంలో దూరి పీకల దాకా తాగాడు. గుడి ముందుకొచ్చి దేవుడ్ని చూసి పిచ్చిగా నవ్వాడు. బండ బూతులు తిట్టాడు. మనుషుల్లో దేవుళ్ళని చూసిన అతని గుండె మళ్ళీ రాయిగా మారింది. మళ్ళీ పరుగులు పెట్టి ఎక్కడికో వెళ్ళిపోతున్నాడు. బహుశా తన బిడ్డ, భార్య మట్టయిన ప్రదేశాని క్కావచ్చు; లేక తన బిడ్డను, భార్యను కలుసుంటాని క్కావచ్చు. గుడిలో దేవుడు చిద్విలాసంగా చూస్తూ అలాగే ఉన్నాడు. రాతి గుండెలో మానవత్వం, జాలిని కురిపించి దాన్ని కరిగించి మంచితనంలోకి మారిపోతున్న ఈ సమయంలో మళ్ళీ బండబార్చి తిరిగి యథాస్థానంలోకి మార్చివేసిన దేవుడు లాంటి ధర్మరాజు ఓడిపొయ్యాడు. ఓడిపోయిన మానవత్వం మళ్ళీ పైశాచికంగా మారిపోయింది. మంచీ, మానవత్వాలే దైవాలని ఊహించిన ఊహలు కల్లలయ్యాయి. ఆ ఊహలు మంచి మనసుల్లో ఏర్పరచిన దేవుడు ఓడిపోయాడు. మట్టి బొమ్మకు ప్రాణం పోసి, దాన్ని నడిపించబోయిన దేవుడు మళ్ళీ దాన్ని మట్టిలోనే కలిపేశాడు. ఇంత చేసినా నా కేం తెలియదన్నట్టు గుళ్ళో దేవుడు చూస్తూ అలానే ఉన్నాడు. . . ఓడిపోయిన దేవుడు లాంటి మనిషి అలానే ఉన్నాడు. *